క్లుప్తంగా

కాలనీలో కార్పొరేటర్ పర్యటన



మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: ఆటో సాయినగర్ కాలనీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని ఆటో సాయినగర్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు శానిటేషన్, డ్రైనేజీ, రోడ్ల సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ హేము నాయక్, కాలనీ అధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు పార్వతి, కాలనీవాసులు పాల్గొన్నారు.

హస్తినాపురంలో వర్షం



హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం కురిసిన అకాల వర్షానికి ప్రజలు కాస్త ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లోని రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిల్వడంతో వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు. తమ దుకాణాల ముందు నీరు నిలిచి ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు వ్యాపారులు వాపోయారు. రోడ్లకు మరమ్మతు చేసి పొంగుతున్న డ్రైనేజీలను శుభ్రపర్చాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

చైన్‌స్నాచింగ్‌కు యత్నం

ప్రతిఘటించిన మహిళకు గాయాలు

సైదాబాద్: చైన్‌స్నాచింగ్‌కు యత్నిస్తుండగా ప్రతిఘటించిన మహిళ కిందపడి గాయాలైన ఘటన సైదాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సైదాబాద్ ఎస్‌బీహెచ్ కాలనీకి చెందిన సీహెచ్.సురేఖ (50) మంగళవారం సాయంత్రం కాలనీలో వాకింగ్ చేస్తుండగా కమ్యూనిటీ హాల్ వద్ద ఆటో నడుపుకుంటూ వచ్చిన వ్యక్తి ఆమె మెడ లోని బంగారు గొలుసు లాక్కునేందుకు యత్నించాడు. అప్రమత్తమైన సురేఖ ప్రతిఘటించి కేకలు వేయడంతో అతడు పారిపోయాడు. ఈ పెనుగులాటలో ఆమె కిందపడటంతో గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మార్కెట్ అభివృద్ధికి సహకరించండి



సురేంద్ర మోహన్‌ను సత్కరిస్తున్న శ్రీనివాస్

సైదాబాద్: మలక్‌పేట మార్కెట్ సమగ్ర అభివృద్ధికి సహకరించాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ మంగళవారం వ్యవసాయ, సహకార మరియు మార్కెటింగ్ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు ఆధునిక యంత్రాలను కేటాయించాలని మార్కెట్‌లో సిబ్బంది కొరతతో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న వారిపై పనిభారం పడుతుందన్నారు. అదే విధంగా మార్కెట్‌కు వచ్చే రైతులు, వినియోగదారుల రక్షణ కోసం మార్కెట్‌లో సెక్యూరిటీ గార్డులను నియమించాలని కోరగా సానుకూలంగా స్పందించారని శ్రీనివాస్ పేర్కొన్నారు.

కాలనీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణాపురం డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కాలనీల్లో చెట్ల కొమ్మలు, చెత్త చెదారం పేరుకుపోవడంతో దోమలు, క్రిమికీటకాలకు నిలయంగా మారుతున్నాయి. ఎస్‌టీఆర్‌నగర్, సిరినగర్, మార్గదర్శికాలనీ తదితర కాలనీల్లోని ఫుట్‌పాత్‌లు, రోడ్లపై ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

నేడు కాంగ్రెస్ కమిటీ సమావేశం

మలక్‌పేట: సలీంనగర్‌లోని రజక సంఘం కమ్యూనిటీహాల్లో బుధవారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు మూసారంబాగ్ డివిజన్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ ప్రతినిధి, ఎమ్మెల్యే హమీద్ పటేల్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సమీర్ వలీయుల్లా, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, మలక్‌పేట ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు హాజరవుతారన్నారు.



కమ్యూనిటీహాల్‌ను కూల్చి నిర్మాణం చేపట్టకుండా వదలేసిన దృశ్యం

సంజీవయ్యనగర్ బస్తీ..

సమస్యలతో కుస్తీ

పరిష్కరించాలంటున్న ప్రజలు | విస్మరిస్తున్న అధికారులు

మూసారంబాగ్ డివిజన్ సంజీవయ్య నగర్‌బస్తీవాసులు సమస్యలతో కుస్తీ పడుతున్నారు. అధికారులు వాటిపై దృష్టి సారించక పరిష్కారానికి నోచుకోవడం లేదు. కమ్యూనిటీహాల్ నిర్మాణాలు, నిరుపయోగం ఉన్న సింథటిక్ వాటర్ ట్యాంకులు, బోర్ మోటర్, ఓపెన్ ప్లాట్‌లో పేరుపోయిన చెత్త, ప్రమాదకరంగా విద్యుత్ తీగలు తదితర సమస్యలు బస్తీవాసులను వేధిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

– మలక్‌పేట

కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరిగేనా..

బస్తీకి చెందిన రెండు కమ్యూనిటీహాళ్లు వివాదంలో ఉండగా ఒకటి నిర్మించగా మరొకదాని ముందడుగు పడలేదు. స్వామి వివేకానంద స్కూల్ చౌరస్తా సమీపంలో మెయిన్‌రోడ్‌పై ఉన్న కమ్యూనిటీహాల్‌లో అంగన్‌వాడీ సెంటర్ నడిపించేవారు. కొత్త కమ్యూనిటీహాల్ నిర్మించడానికి 2014లో జీహెచ్‌ఎంసీ అధికారులు రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయగా పాత భవనం కూల్చివేసి నిర్మాణ పనులకు అప్పటి కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. స్థలం తనదంటూ ఓ వ్యక్తి కోర్టుకు వెళ్లగా పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో ఇప్పటి వరకు కమ్యూనిటీహాల్ పట్టించుకున్న వారే లేరు. అవసరాలకు పనికి వచ్చే కమ్యూనిటీ హాల్‌ను కూల్చివేయడంతో ఇబ్బందులు పడుతున్నామని బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాల్సిన బస్తీవాసులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు..

ప్రమాదం తెలిసి కూడా కొందరు జానడు జాగా కోసం కరెంట్ స్తంభాలను సైతం ఆక్రమణలు చేసి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. సంబంధిత అధికారులు ఈ ఆక్రమణలపై చర్యలు తీసుకున్న దఖాలాలు లేవు. ఎవరికి అందినంత వరకు వారు కరెంట్ స్తంభాలు ఆక్రమించుకుని ఇంటికి బాల్కనీ నిర్మాణాలు చేపట్టారు. ఏదైనా నష్టం జరిగితే ఏవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. బస్తీవాసుల తాగునీటి కోసం లక్షలు వెచ్చించి సింథటిక్ వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. వాటికి పర్యవేక్షణ లేక నిరుపయోగం మారాయి. వాటికి బిగించిన నల్లాలు పాడైపోయాయి. పక్కనే ఏర్పాటు చేసిన బోర్‌మోటర్ వాడకంలో లేదు. దానికి మరమ్మతు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పేరుకుపోతున్న చెత్త..

బాగ్‌మోసారిమో ప్రభుత్వ స్కూల్ పక్కన ఉన్న ఓపెన్ ప్లాట్‌లో చెత్త చెదారంతో నిండిపోయింది. వాటిని తొలగించాలని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కొంత మేరకు తొలగించి అధికారులు చేతులు దులుపుకున్నారు. అయితే పూర్తిగా తొలగించకపోవడంతో విద్యార్థులు, బస్తీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పేరుకుపోతున్న చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పనిచేయని సింథటిక్ వాటర్ ట్యాంకులు, బోర్ మోటర్ చూపిస్తున్న బస్తీవాసులు

అధికారులు బస్తీలో పర్యటించాలి..



బస్తీలోని సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. కమ్యూనిటీహాల్ నిర్మాణం అయితే అంతే సంగతి. సింథటిక్ వాటర్ ట్యాంకర్లకు ఉన్న నల్లాలు ధ్వంసమయ్యాయి. బోర్ మోటర్ పనిచేయడం లేదు. సంబంధిత అధికారులు బస్తీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి.

– ముప్పిడి బల్వంత్, బస్తీ నాయకుడు

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతి



కాలనీవాసులతో కలిసి మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి శ్రీపురం కాలనీలో ఉన్న ఛత్రపతి శివాజీ పార్కును అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఈ రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేసి కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మొద్దుల చ్చిరెడ్డి కాలనీ వాసులతో కలిసి మంగళవారం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. హయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని శ్రీపురంకాలనీలో సర్వే నెంబర్ 200లో ఈ కాలనీ ఉందని,1967లో కాలనీ లేఅవుట్‌ను ఏర్పాటు చేసిన సందర్భంలో 5000 గజాల స్థలాన్ని పార్కు కోసం, క్రీడా మైదానాలకు వదలివేయడం జరిగిందని మంత్రికి వివరించారు. అందులో భాగంగా పార్కు స్థలం కోసం జీహెచ్‌ఎంసీ నుంచి నిధులు మంజూరు చేసి పార్కును అభివృద్ధి చేసి కాలనీ వాసుల కోసం పార్కును నిర్మించారు. ఈ స్థలంపై కబ్జాదారుల కన్ను పడి పార్కును వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తప్పుడు పత్రాలను సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. మంత్రి స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో శ్రీధర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేందర్, చిగురింత శ్రీధర్‌రెడ్డి, రాములు ఉన్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి

సైదాబాద్: సైదాబాద్ జైల్‌గార్డెన్‌లోని ప్రభుత్వ బాలల సదనంలో బాలుడిపై స్టాఫ్ గార్డ్ ఉద్యోగి లైంగిక దాడి చేసిన కేసులో సమగ్ర విచారణ జరిపించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక సైదాబాద్ మండల కన్వీనర్ షేక్ మహమూద్ డిమాండ్ చేసారు. మంగళవారం ఆయన వేదిక సభ్యులతో కలిసి జువైనల్ హోం, సైదాబాద్ పోలీస్ స్టేషన్లను సందర్శించి ఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లైంగిన దాడి ఘటనలతో బాలల మానసిక స్థితి దెబ్బ తింటుందన్నారు. ప్రభుత్వ బాలల సదనాల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సదనాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ప్రవర్తనపై అధికారులు బాలలను ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకోవాలని అన్నారు. బాధిత బాలుడిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రఘుపతి నాయక్, దశరథ్, గోపాల్, శ్రీను నాయక్, సంతోషి, సాయిలక్ష్మి, అలివేలు పాల్గొన్నారు.

రైతు బజారులలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురంలోని రైతుబజారులలో కూరగాయల ధరలు.. టమాట 23, వంకాయ 40, బెండ 35, పచ్చిమిర్చి 35, కాకర 45, బీర 35, క్యాబేజి 23, ఫ్రెంచి బీన్స్ 45, క్యారెట్ 47, దొండ 23–28, చిక్కుడు 75, గోకర 50, బీట్‌రూట్ 45, క్యాప్సికం 60, ఆలు 24, దోస 18, సొర 15, పొట్ల 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 23.
ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

రోడ్డంతా చెత్త.. నడిచేదెట్లా?



కార్గో రోడ్డు పక్కన పడేసిన వ్యర్థాలు

- ఎక్కడి నుంచో తెచ్చి జల్‌పల్లి చెరువు పరిసరాల్లో డంపు

పహాడీషరీఫ్: పర్యావరణ హితాన్ని మరిచిన కొందరు ఇతర ప్రాంతాల నుంచి సంచులలో చెత్తా చెదారాలను తీసుకొచ్చి జల్‌పల్లి చెరువు పరిసరాలలో పడేసి ఈ ప్రాంతాన్ని అపరిశుభ్రంగా మారుస్తున్నారు. ముత్యాలమ్మ ఆలయం నుంచి డేసీ దాబా వైపు వెళ్లే కార్గో రోడ్డులో లక్ష్మీగూడ, వాంబే కాలనీ, కాటేదాన్, ఉడంగడ్డ, పాతబస్తీ తదితర ప్రాంతాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పశు, మెడికల్, పరిశ్రమల వ్యర్థాలను సంచులలో మూటగా కట్టుకొని ఆటోలలో తీసుకొచ్చి చీకటి మాటున యథేచ్ఛగా పడేసి పోతున్నారు. జల్‌పల్లి కమాన్ వద్ద ప్రస్తుతం పార్కు ఏర్పాటుతో అక్కడ వేయడానికి వీలు కాకపోవడంతో, కొంచెం ముందుకు రోడ్డు పక్కన నిర్మానుష్య ప్రదేశాలలో కూడా ఇలాంటి వ్యర్థాలనే పడేస్తున్నారు.

దుర్గంధభరితం

కళేబరాలు, ఇతర వ్యర్థాలను పడేస్తుండడంతో వెలువడుతున్న తీవ్ర దుర్గంధంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారుల ముక్కుపుటాలదురుతున్నాయి. ఎక్కడో వ్యక్తులను హత్య చేసి మృతదేహాలను సంచిలో కుక్కిన ఘటనలు కూడా పలుమార్లు వెలుగు చూశాయి. అప్పుడప్పుడు ఇలాంటి ఆటోవాలాలను మున్సిపల్ సిబ్బంది పట్టుకొని జరిమానాలు విధించినా మార్పు కనిపించడం లేదు. ఒక్కోసారి ఇలాంటి వారిని విడిపించడానికి స్థానిక రాజకీయ నాయకులే జోక్యం చేసుకుంటుండడంతో పరిస్థితిలో మార్పు రావడం లేదు. ఈ విషయంలో మున్సిపల్ అధికారులు కఠినంగా వ్యవహరించి, అవసరమైన మేరకు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఉందని వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

మహేశ్వరం: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బీఆర్‌ఎస్ మండల యువ నాయకులు మర్యాద రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఆయన జన్మదినం సందర్భంగా పాఠశాలలో చదివే 120 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యతతో కూడిన విద్య అందిస్తుందన్నారు. సమస్యలను ఎమ్మెల్యే సబితా రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కస్నానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూ.18 లక్షలతో ఆధునిక ప్లేపార్కు



స్థానికులతో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: డివిజన్ పరిధి జనప్రియా అపార్ట్‌మెంట్స్ చిన్నారుల సౌకర్యార్థం రూ.18 లక్షలతో అధునిక ప్లే పార్కు నిర్మాణం చేపడుతున్నట్లు లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ఒకప్పుడు జనప్రియ అపార్ట్‌మెంట్ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి కాలనీకి కొత్త ఊపిరి వచ్చిందన్నారు. ప్రజల సహకారం, అధికారుల చొరవతో సీసీరోడ్లు, వీధి దీపాలు, ఓపెన్ జిమ్‌లు, డ్రైనేజీ వ్యవస్థ సదుపాయాలు కల్పించామన్నారు. లింగోజిగూడ డివిజన్ అభివృద్ధికి ప్రాజెక్టులను రూపొందించడం జరిగిందని, దశలవారీగా పనులు చేపడుతున్నామన్నారు. కార్పొరేటర్ వెంట ఆంజనేయులు గౌడ్, జ్యోతిరెడ్డి, శాంత, కళ, మానసా, నవత, అరుణ, అనురాధ, యశోద ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే బస్తీబాట



విద్యుత్ అధికారులు, కాలనీవాసులతో కలిసి టీ తాగుతూ సమస్యలపై చర్చిస్తున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: విద్యుత్ సమస్యలను నేరుగా పరిష్కరించేందుకు విద్యుత్ అధికారుల బస్తీబాట కార్యక్రమం శుభపరిణామమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. హయత్‌నగర్ పరిధి వినాయక్‌నగర్‌కాలనీ ఫేజ్–2లో మంగళవారం విద్యుత్ అధికారులు చేపట్టిన బస్తీబాట కార్యక్రమానికి కార్పొరేటర్ హాజరై మాట్లాడారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేసి విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయటం అవసరమన్నారు. విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడంతో కొన్ని సమస్యలు తక్షణమే పరిష్కారం అవుతాయన్నారు. కాలనీల్లో సింగిల్ ఫేజ్, త్రీఫేజ్ విద్యుత్ సమస్యలు, పాత స్తంభాలను మార్చటం, ప్రమాదకరంగా ఉన్న తీగలను సరిచేయటం లాంటి విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ మిరాజుద్దీన్, లైన్‌మెన్ యాదయ్య, దినేష్, కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, రవితేజ, సంజీవరెడ్డి, పద్మారావు, యాదయ్య, మురళీధర్‌రెడ్డి, మల్లికార్జున్, రుక్మారెడ్డి పాల్గొన్నారు.



వైదేహినగర్‌లో వైర్లను సరిచేస్తున్న సిబ్బంది

నార్త్ వైదేహినగర్‌కాలనీలో..

ఎల్‌బీనగర్: సమస్యల పరిష్కారం కోసమే విద్యుత్ అధికారులు బస్తీబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని చంపాపేట డీఈ రాజేందర్‌కుమార్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని నార్త్ వైదేహినగర్‌కాలనీలో మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు బస్తీబాట కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీబాటలో విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఏఈ శివకుమార్ మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభాల మధ్యన ఉన్న లో టెన్షన్ వైర్లు ఒక దానికి ఒకటి తాకుతున్నాయని ఈ సమస్యను పరిష్కరించామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చెత్తను వేయకుండ కాలనీ వాసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రాంబాబు, అన్నంరాజు శ్రీనివాస్, నాగరాజు, వేణుగోపాల్, ప్రభాకర్‌రావు,కిషోర్, శ్రీనివాస్, ఈమని కృష్ణ, పాల్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మెల్యే సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు పార్టీ నాయకులు పల్లపు శంకర్, షేక్ అఫ్జల్, యంజాల అర్జున్ ఆమెను మంగళవారం కలిసి సమస్యలను వెల్లడించారు. అవుట్‌లెట్ సమస్య కారణంగా శ్రీరాం కాలనీ, వాదే ముస్తఫా బస్తీలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పారిశుద్ధ్యం, మురుగు సమస్య తలెత్తకుండా మున్సిపల్ అధికారులను ఆదేశించాలని కోరారు. వెంటనే స్పందించిన ఆమె నిర్వహణ పనులలో జాప్యం లేకుండా చూసుకోవాలని కమిషనర్‌కు ఫోన్ ద్వారా సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మీర్‌పేట: ముఖ్యమంత్రి సహాయ నిధిని పేద ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక లబ్ధి పొందాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సూచించారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్‌కు చెందిన హారికకు మంజూరైన రూ.18వేల చెక్కును మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఆమె తండ్రి సత్యనారాయణరెడ్డికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అర్కల కామేశ్‌రెడ్డి, దిండు భూపేష్‌గౌడ్, జటావత్ శ్రీనునాయక్, సిద్దాల బీరప్ప, సునీత బాలరాజ్ పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. ఆలయం ప్రాంగణంలో సామూహిక సత్యానారాయణ స్వామి వత్రాలు చేశారు. నాగ దేవతకు పుట్టలో పాలు పోసి కొలిచారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది కాశీనాథ్, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నిబంధనలు పాటించకుంటే చర్యలే..

- టపాసుల దుకాణాల వద్ద ఫైర్ సేఫ్టీ ఉంచుకోవాలి
- సాక్షితో చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మురారి



దీపావళి సందర్భంగా బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలి. ఇప్పటికే ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైంది. లైసెన్స్ పొందిన సమయంలో సూచించిన నిబంధనలు తప్పకుండా పాటించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తూ విక్రయాలకు పాల్పడితే లైసెన్స్ రద్దుతో పాటు కఠిన చర్యలు తప్పవని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ మురారి సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

– చాదర్‌ఘాట్

ప్రశ్న: టపాసుల దుకాణాల అనుమతి జారీ ప్రక్రియ ఏ విధంగా ఉంటుంది ?
సీఐ: టీఎస్ ఫైర్.కామ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ నుంచి తమకు విచారణ నిమిత్తం పంపిస్తారు. విచారణ అనంతరం తిరిగి ఆన్‌లైన్‌లో పంపిస్తాం.

ప్రశ్న: టపాసుల దుకాణాల ఏర్పాటు చేసుకోవాలంటే ఎలాంటి నిబంధనలు ఉంటాయి ?
సీఐ: ఖాళీ ప్రాంతంలోనే దుకాణాలు ఏర్పాటుకు అనుమతి ఉంటుంది. ఒక వేళ షాపులో విక్రయాలు కొనసాగించాలనుకుంటే షాపు మాత్రమే సింగల్‌గా ఉండాలి. అలాగే షాపుల నడుమ కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలి.

ప్రశ్న: విక్రయదారులు ప్రధానంగా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి ?
సీఐ: ప్రతి విక్రయ కేంద్రం వద్ద నో స్మోకింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలి. ఫైర్ ఆర్పే పరికరాన్ని ఉంచుకోవాలి. ఒక బక్కెట్ ఇసుకను కనీసం రెండు డ్రమ్ములు నీటిని అందుబాటులో ఉంచాలి. 18 ఏళ్ల లోపు వారిని దుకాణాల్లో పెట్టుకోరాదు.

ప్రశ్న: మీ పరిధి ఎంత వరకు ఉంది ?
సీఐ: ఆజంపురా, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట్ ఈ ప్రాంతాల వరకు మా పరిధి విస్తరించి ఉంది. దుకాణాలు ఏర్పాటు చేసుకొనే వారు అనుమతులకు సంబంధించి నివేదిక ఇస్తాం.

ప్రశ్న: అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలి?
సీఐ: షాపుల వద్ద లేదా ఇళ్ల వద్ద టపాసులు కాల్చే సమయంలో ఏ చిన్న అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే 101 లేదా కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలి.